రెహ్మత్‌నగర్‌లో

రోడ్డు విస్తరణ ఎప్పుడు?



రెహ్మత్‌నగర్ పీజేఆర్ మలుపు వద్ద వాహనాలు

- దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ట్రాఫిక్ సమస్య
- రద్దీ వేళల్లో భారీగా రోడ్లపై నిలుస్తున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా దశాబ్దాలుగా రెహ్మత్‌నగర్ డివిజన్‌లోని రెండు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి మోతీనగర్ చౌరస్తా వరకు రోడ్డును ఉన్నతాధికారులు పరిశీలించి వెళ్లినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. రద్దీవేళల్లో ఈ మార్గం నుంచి వెళ్లే వాహనదారులు నరకం చూస్తున్నారు.

యూసుఫ్‌గూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాహనాల రద్దీ దృష్ట్యా యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి మోతీనగర్ వరకు రోడ్డును విశాలంగా మార్చాలని సంవత్సరాల క్రితం అధికారులు ప్రణాళిక రూపొందించారు. అనేక ఆటంకాలు వచ్చినా దాదాపుగా పనులు సాగాయి. కేవలం రెహ్మత్‌నగర్ నిమ్స్‌మే నుంచి మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు, నిమ్స్‌మే గ్రౌండ్ నుంచి శ్రీరామ్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ జరగలేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఇక్కడి నుంచి వెళ్లే వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ అధికారులకు కంఠంకంగా మారింది.

ఇరుగ్గా రెహ్మత్‌నగర్ మలుపు

వేలాదిగా భారీ వాహనాలు ప్రయాణించే రెహ్మత్‌నగర్ చౌరస్తా వద్ద పీజేఆర్ మలుపు చాలా ఇరుగ్గా ఉంది. ఇక్కడ ఒక వాహనం మళ్లడమే కష్టం. ఎదురుగా మరో వాహనం వస్తే గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది.

విస్తరించినా.. ఉపయోగం లేదు

శ్రీరామ్‌నగర్ ఆంజనేయ ఆలయం నుంచి మోతీనగర్ వరకు రోడ్డు వన్ వేగా విస్తరణ జరిగింది. ఇక్కడ భారీ వాహనాలు మలుపు తీసుకునేందుకు వీలుగా లేకపోవడంతో అటుగా వెళ్లడం లేదు. శ్రీరామ్‌నగర్ చౌరస్తా వద్ద ఆటోలు, ఇతర వాహనాలను పార్కు చేస్తుండడంతో మలుపు తీసుకునేందుకు వీలు కలగడం లేదు. మోతీనగర్ జైస్వాల్ ఆస్పత్రి వరకు వన్‌వే ఉన్నా వాహనదారులు అటుగా వెళ్లకుండా ఒకవైపు మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు.



ఒకే మార్గంలో రాకపోకల వల్ల ట్రాఫిక్‌జామ్



శ్రీరామ్‌నగర్‌లో ఒకే మార్గంలో రాకపోకలు

పర్యటించిన ఉన్నతాధికారులు

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న సమయంలో రోనాల్డ్ రోస్, చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి రోడ్డును పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యంపై ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరగా పనులు జరిగేలా చూస్తామని చెప్పినా.. నేటికీ ముందడుగు పడలేదు.

బడ్జెట్ వస్తే పనులు మొదలవుతాయి



రెహ్మత్‌నగర్ రోడ్డు విస్తరణ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో పాటు స్టాండింగ్ కమిటీలోనూ చర్చించడం జరిగింది. బాధితులకు నష్టపరిహారం అందిస్తే మలుపు వద్ద విస్తరణ పూర్తవుతుంది. బడ్జెట్ కేటాయింపు జరిగితే ఇక్కడ పనులు మొదలవుతాయి. మధురానగర్, శ్రీరామ్‌నగర్‌లో కూడ రోడ్డు విస్తరణకు కృషి చేస్తా.

\- సీఎస్ రెడ్డి, కార్పొరేటర్



విద్యుత్ తనిఖీల శాఖ ప్రధాన అధికారిగా విరమణ చేసిన శ్రీనివాసరావును మాసబ్‌ట్యాంక్‌లోని సీఈఐజీ ప్రధానకార్యాలయంలో సత్కరించిన సీఈఐజీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు
● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



జీహెచ్ఎంసీ సీపీఆర్ఓగా ఉద్యోగ విరమణ పొందిన మహ్మద్ ముర్తుజాను సత్కరించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఉద్యోగులు
● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



పీకే హజారి దంపతులను సన్మానిస్తున్న విమానాశ్రయ ఉద్యోగులు

బేగంపేట విమానాశ్రయం డైరెక్టర్ పదవీ విరమణ

బేగంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బేగంపేట విమానాశ్రయం డైరెక్టర్‌గా సేవలందించిన పీకే హజారి శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా విమానాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగులు పీకే హజారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నూతన డైరెక్టర్ వరుదు వి.రావు హాజరయ్యారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు గోపకుమార్, కె.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీకి పాల్కురికి సోమనాథుని పేరు పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఐ.తిరుమలి

పంజాగుట్ట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయానికి తెలుగులో స్వతంత్ర రచనలు చేసిన తొలి కవి, తెలంగాణ ఆదికవిగా అందరి మన్ననలు పొందిన పాల్కురికి సోమనాథుని పేరు పెట్టాలని వక్తలు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు. సోమనాథ కళా పీఠం ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుని పేరే సమంజసం అనే అంశంపై పీఠం కన్వీనర్ డాక్టర్ రాపోలు సత్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రాంత చరిత్రకారులు, మేధావులు ప్రొఫెసర్లు దామోదర్, రాములు, ఐ.తిరుమలి, ప్రభంజన్ యాదవ్, పీఠం సమన్వయకర్త డాక్టర్ వీవీ రావు తదితరులు మాట్లాడారు. సురవరం ప్రతాపరెడ్డి కంటే ముందే తెలంగాణ ప్రాంతంలో సాహిత్య అభివృద్ధికి పాటుపడిన సోమనాథుని పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడం సముచితమని వారు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నేపథ్యాన్ని, సోమనాథుని విశిష్టతను గుర్తించి ఆయన పేరును పెట్టాలని వారు కోరారు.



పరివారోత్సవ్ కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు

కుటుంబ బంధాలను పటిష్టం చేయడమే పరివారోత్సవ్ లక్ష్యం

ఎర్రగడ్డ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పరివారోత్సవం ద్వారా కుటుంబ బంధాలను పటిష్టం చేయడమే లక్ష్యమని సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఫౌండర్ సీఈవో ఎ.మోహనవంశీ అన్నారు. శనివారం ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్లో జరిగిన పరివారోత్సవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ నైపుణ్యాలు, సృజనాత్మకతతో ప్రేక్షకులను అబ్బురపరచడం పరివారోత్సవ్ ప్రత్యేకతగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అమీర్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): క్లినోసల్ ఇనిస్టిట్యూట్, బృహత్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం అమీర్‌పేటలో ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బృహత్ ఆయుర్వేద చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ సత్యసాయి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా పేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి సహకరించిన క్లినోసల్ సీఈఓ ముజీబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 340 మంది ఆయుర్వేద మందులను తీసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కౌశిక్ రాయల్, డాక్టర్ జయచంద్రారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో కారు బీభత్సం



బోల్తా పడిన ఫార్చ్యూనర్

బంజారాహిల్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లో కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా రెండు కార్లు, ఆటో ధ్వంసమయ్యాయి. చిలకలగూడకు చెందిన అబ్బాస్ ఈ నెల 30న కుటుంబ సభ్యులతో కలిసి బార్కాస్‌లో ఓ శుభకార్యానికి వెళ్లాడు. శనివారం తిరిగి వస్తుండగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3 లుంబినీ ఎన్‌క్లేవ్ వద్ద కారు అదుపు తప్పడంతో ఓ ఆటో, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టి బోల్తా పడింది. స్థానికులు కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అబ్బాస్‌తో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహిళలను వెంబడించడమే కాకుండా ఫోన్ నంబర్ అడుగుతూ వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనర్సింహనగర్‌కు చెందిన కె.సరిత ఇళ్లలో పనిచేస్తుంది. చాలాకాలం క్రితం భర్తతో విడిపోయి ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసముంటుంది. ప్రతి రోజూ పని నిమిత్తం నవోదయ కాలనీలోని ఉషా ఎన్‌క్లేవ్‌కు వస్తుంది. కొన్ని రోజులుగా రవి అనే వ్యక్తి వెంబడించడం మొదలు పెట్టాడు. గత వారం ఫోన్ నంబర్ అడిగాడు. దీంతో సరిత హెచ్చరించింది. ఇదిలా ఉండగా ఈ నెల 30న రవికి ఆమె కుమార్తె కనిపించింది. బాలికను ఆపి సరిత ఫోన్ నంబర్ అడిగాడు. ఇదే విషయం కుమార్తె చెప్పడంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు చోరీ

యూసుఫ్‌గూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాలు చోరీ అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎండీ అజారుద్దీన్ ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 29న విధులు ముగించుకుని రాత్రి తాను నివసిస్తున్న ఇంటి వద్ద ద్విచక్రవాహనం పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. అలాగే, సారథి స్టూడియో సమీపంలో నివసించే వి.సూర్యజగన్నాథం ఈ నెల 29న రాత్రి తన ఇంటి ఎదుట ద్విచక్రవాహనం పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టర్ల వేధింపుల నుంచి కాపాడండి

- ఇసుక లారీ యజమానుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఇసుక లారీల యజమానులు

బంజారాహిల్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లతో తమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని ఆటోనగర్ యజమానుల సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సంస్థ జీఎం రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన జీఎం రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్ ఇసుక లారీల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ మాట్లాడుతూ తాము అధికారికంగా ప్రభుత్వానికి డీడీ తీసి క్వారీల వద్దకు వెళ్లగానే అక్కడ ఉన్న కాంట్రాక్టర్లు లోడింగ్ పేరుతో రూ.4 వేల నుంచి రూ.5 వేలు, అదనపు బకెట్ పేరుతో రూ.2 వేలు, పట్టా పేరుతో వెయ్యి రూపాయలు, ఎక్స్‌కవేటర్ పేరుతో వెయ్యి రూపాయలు, గ్రామపంచాయతీ అంటూ వెయ్యి రూపాయలు, కాంటా పేరుతో రూ.200 ఇలా దాదాపుగా ఒక్కో లారీకి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు అధికారులు తనిఖీలు చేసినప్పుడు ఓవర్ లోడ్ పేరుతో లారీ యజమానులు కేసుల పాలవుతూ, జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు టీజీఎండీసీ ఎండీ, జీఎంలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి క్వారీల్లో అక్రమంగా వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని లారీ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తపేట లారీల అధ్యక్షుడు నర్రి వెంకన్న, బల్వంతరెడ్డి, నాగేందర్‌రెడ్డి, రాజు ముదిరాజ్, కాసుల జంగయ్యగౌడ్, ఆకుల శ్రీను, లగ్గొని శ్రీనివాస్, రాజేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు ఏర్పాట్లు



గణేశ్ నిమజ్జనం శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, జీహెచ్ఎంసీ సర్కిల్-17 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

పంజాగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగేందుకు, శోభాయాత్ర సజావుగా సాగేందుకు వివిధ విభాగాల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సాగే మార్గాలను పంజాగుట్ట ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్, జీహెచ్ఎంసీ సర్కిల్-17డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి, పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, జీహెచ్ఎంసీ అర్బన్ బయో డైవర్సిటీ(యూబీడీ) మేనేజర్ జ్యోత్స్న, తదితరులు పరిశీలించారు. ఆయా మార్గాలను తనిఖీ చేశారు. నిమజ్జనానికి తరలివెళ్లే మార్గంలో గుంతలకు మరమ్మతులు చేయాలని, అడ్డుగా వచ్చే చెట్లకొమ్మలు, విద్యుత్ తీగలు తొలగించాలని, వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎస్ఐ వెంకటకిషన్, ఏఈ జమీల్, లైన్‌మన్ నరేష్, సిబ్బంది ఉన్నారు.



ఖైరతాబాద్ మహాగణపతి తొలిపూజ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరుకావాలని ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అడ్‌హక్ కమిటీ సభ్యులు లక్ష్మణ్ యాదవ్, రాంరెడ్డి, కృష్ణ యాదవ్, బాక్సర్ అశోక్, మహేందర్‌బాబు, అనిల్ కుమార్, మహేష్ యాదవ్, చంద్రశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు
\- పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి



గణేశ్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కర్రపూజతో ప్రారంభిస్తున్న వెంకటగిరి యూత్ అసోషియేషన్ అధ్యక్షుడు పులిరామ్, ఉపాధ్యక్షుడు బరిగెల జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి బడుగు సతీష్, ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి రవికుమార్‌గౌడ్ తదితరులు
\- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి



సికింద్రాబాద్‌లో కాపు మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మాతాచౌకి పూజలో పాల్గొన్న సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ, నాయకుడు విశాల్ సుధం తదితరులు
● బేగంపేట, ఆంధ్రజ్యోతి

పౌర హక్కులపై అవగాహన సదస్సు



మాధవిని సన్మానిస్తున్న సత్యనారాయణ

అమీర్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ బుద్ధనగర్‌లో నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొలుసుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పౌర హక్కులపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ తహసీల్దార్ మాధవి హాజరయ్యారు. పౌర హక్కులపై అవగాహన కల్పించారు.

మణిపూర్‌లో కూకి తెగ నివాస ప్రాంతాన్ని యూటీగా ప్రకటించాలి

- కూకి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్



సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కూకిలు

బర్కత్‌పుర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో కూకిలు నివసిస్తున్న ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతం(యూనియన్ టెర్రిటోరి)గా ప్రకటించి, పూర్తిరక్షణ కల్పించాలని కూకి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ బ్రాంచి డిమాండ్ చేసింది. పాండిచ్చేరి మాదిరిగా రాజ్యాంగంలోని 239వ ఆర్టికల్ ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తే మణిపూర్ రాష్ట్రంలో కూకీలు శాంతియుత జీవనం సాగిస్తారని వారు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకి ఐఎన్ఎస్‌పీ ప్రతినిధులు లూనాడొంగల్, లెటోకోలన్ సవంటక్, ఫ్రాన్సిస్ హోకిట్, కూకి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రధానకార్యదర్శి తొంగమిన్ తాంగా హోకిప్, కోశాధికారి గ్రేసి కాన్సాయి, జోయ్‌సీ చాంగులాయి తదితరులు మాట్లాడారు. మణిపూర్‌లో కూకి, నాగోస్ 48 శాతం జనాభా ఉండగా మైతాస్ కులస్తులు 52 శాతం ఉన్నారని, గత సంవత్సరం జరిగిన సంఘటనల్లో కూకిలు తీవ్రంగా నష్టపోయారని వారు ఆరోపించారు. మణిపూర్‌లో మెజార్టీ కులస్తులైన మైథాస్‌లతో కలిసి జీవించాలని కూకీలు కోరుకోవడం లేదని, మళ్లీ దాడులు జరుగుతాయేమోనని, తాము ఇండియా నుంచి విడిపోయే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు.



రవీందర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రజా సంబంధాలు, సమాచారశాఖలో 33 ఏళ్లుగా పనిచేసి శనివారం ఉద్యోగ విరమణ పొందిన చెంగల రవీందర్‌ను కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణలు సహజమన్నారు. ఉద్యోగ సమయంలో వారు చేసిన సేవలు చిరకాలం నిలుస్తాయన్నారు. సమాచారశాఖలో రవీందర్ వృత్తి నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ కలీం, అధికారులు అనంతం, వెంకటయ్య, హబీబ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన వారిని నిమ్స్‌లో సన్మానించిన దృశ్యం

నిమ్స్ ఉద్యోగులకు విరమణ సన్మానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఉద్యోగులు పలువురు శనివారం పదవీ విరమణ చేశారు. ఆస్పత్రి మొదటి అంతస్తులోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగులను ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారిలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజ్‌కుమార్, సీనియర్ మెడికో సోషల్ వర్కర్ పార్వతి, ఇందిర, ఎక్స్‌రే టెక్నీషియన్ ఆనంద్‌రావు, సెక్రటేరియల్ అసిస్టెంట్ విజయలక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్ సత్యగీత ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్ ఇంటిని ముట్టడిస్తాం

పంజాగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, 24 గంటల్లో ఆయన క్షమాపణ చెప్పకుంటే ఇంటిని ముట్టడిస్తామని ఈటల రాజేందర్ అభిమానులు, వివిధ సంఘాల నాయకులు హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈటల అభిమానులు, ఎంపీటీసీల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్, ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ నెహ్రూనాయక్, బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ శ్రీనాథ్, నారపాక అశోక్, బి.రాజుముదిరాజ్, భైరి శేఖర్, రామిడి వెంకట్‌రెడ్డి, కంచర్ల భరత్‌రెడ్డి, రామలింగం ప్రజాపతి, తదితరులు మాట్లాడారు. ప్రొఫెసర్ తన స్థాయిని మరిచి ప్రజానేతపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఈటల అభిమానులు పాల్గొన్నారు.



టీజీ రెడ్కో చైర్మన్ అనిలా వావిల్లను మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బుర్ర అశోక్‌కుమార్‌గౌడ్, జనరల్ సెక్రటరీ టి.శ్రీహరిబాబు, జాయింట్ సెక్రటరీ బాబునాయుడు, వైస్ ప్రెసిడెంట్ రాజేష్ పరకాల తదితరులు
● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



మందకృష్ణ మాదిగను సత్కరిస్తున్న బాలాంజనేయస్వామి ఆలయ చైర్మన్ నాగులూరి సాయిబాబా తదితరులు

మందకృష్ణ మాదిగకు సత్కారం

బౌద్ధనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధించటంలో ఎన్నో వడిదుడుకులు ఎదుర్కొని పోరాటాలు చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగను శనివారం ఉదయం చిలకలగూడలో ఘనంగా సత్కారించారు. బాలాంజనేయస్వామి ఆలయ చైర్మన్ నాగులూరి సాయిబాబా నివాసానికి చేరుకున్న మందకృష్ణమాదిగకు ఘన స్వాగతం పలికారు. మందకృష్ణ మాదిగకు ఆయన శాలువా కప్పి మోమెంటోను అందజేసి సన్మానించారు. ముప్పై సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి అండగా ఉండి సహాయ సహకారాలందజేసిన నాగులూరి సాయిబాబాకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని మందకృష్ణ మాదిగ అన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, శంకర్, అంజనేయులు పాల్గొన్నారు.

ఇళ్లల్లో దోమల మందు పిచికారీ



బౌద్ధనగర్‌లో ఓ ఇంట్లో దోమల మందును పిచికారీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బౌద్ధనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులను నివారించేందుకు జీహెచ్‌ఎంసీ విభాగం తగిన చర్యలు చేపట్టింది. ఇళ్లల్లో దోమల మందును పిచికారీ చేస్తుంది. శనివారం బౌద్ధనగర్‌లో పలు ఇళ్లల్లో ఎంటమాలాజి విభాగం అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఇళ్లల్లో దోమల మందును పిచికారీ చేశారు. ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే వ్యాధులను నివారించవచ్చునని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంటమాలాజి ఫీల్డ్ వర్కర్ ఆర్.మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు బెజ్జంకి రాజేశ్, బి.విజయ్, కోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కూకిలు

మణిపూర్‌లో కూకి తెగ నివాస ప్రాంతాన్ని యూటీగా ప్రకటించాలి

● కూకి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్

బర్కత్‌పుర , ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో కూకిలు నివసిస్తున్న ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతం (యూనియన్ టెర్రిటోరి)గా ప్రకటించి, పూర్తిరక్షణ కల్పించాలని కూకి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ బ్రాంచి డిమాండ్ చేసింది. పాండిచ్చేరి మాదిరిగా రాజ్యాంగంలోని 239వ ఆర్టికల్ ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తే మణిపూర్ రాష్ట్రంలో కూకీలు శాంతియుత జీవనం సాగిస్తారని వారు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకి ఐఎస్ఎన్‌పీ ప్రతినిధులు లూనాడొంగల్, లెట్‌కోలన్ సవంటక్, ఫ్రాన్సిస్ హోకిట్, కూకి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి తొంగమిన్ తాంగాహాకిప్, కోశాధికారి గ్రేసి కాన్సాయి, జోయ్‌సీ చాంగులాయి తదితరులు మాట్లాడారు. మణిపూర్‌లో కూకి, నాగోస్ 48 శాతం జనాభా ఉండగా మైతాస్ కులస్థులు 52 శాతం ఉన్నారని గత సంవత్సరం జరిగిన సంఘటనల్లో కూకిలు తీవ్రంగా నష్టపోయారని వారు ఆరోపించారు. మణిపూర్‌లో మెజార్టీ కులస్థులైన మైథాస్‌లతో కలిసి జీవించాలని కూకీలు కోరుకోవడం లేదని, మళ్లీ దాడులు జరుగుతాయోనని, తాము ఇండియా నుంచి విడిపోయేప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు.



రైల్వే స్టేషన్‌లో పర్సు దొంగను అరెస్టు చేసిన ఆర్పీఎఫ్ రుద్రమ్మ శక్తి టీం

పర్సు దొంగ అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని సికింద్రాబాద్ డివిజనల్ ఆర్పీఎఫ్ రుద్రమ్మ శక్తి ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ నంబర్ 1లోని గేటు నంబరు 3లో వెయింటింగ్ హాల్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగున్న వ్యక్తిని పట్టుకున్నారు. తన జేబులో వెయిటింగ్ హాల్‌లో నిద్రిస్తున్న ప్రయాణికుడి పర్సు ఉండడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ. 2,935 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన ఆర్పీఎఫ్ పోలలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 1లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో మరణించాడు. ప్రయాణికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించిన ఘటన మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరి వసంతపురి కాలనీకి చెందిన పేరుమాండ్ల నర్సింహ(63) శనివారం ఉదయం లాలాగూడ-మల్కాజిరి రైల్వే స్టేషన్ మార్గ మధ్యలో గమనించకుండా రైలు పట్టాలు దాటుతుండగా ఆ సమయంలో దూసుకవచ్చిన నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తల్లితో గొడవపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మచ్చబొల్లారం సాయినగర్‌కాలనీ ప్రాంతానికి చెందిన వెస్లీ(30) శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అకారణంగా తల్లితో గొడవపడి తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఇనుప చువ్వలకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం నుంచి బెడ్‌రూమ్ డోర్ తీయకపోవడంతో వెస్లీ తల్లికి అనుమానం వచ్చి కిటికిలోంచి తొంగి చూడగా వెస్లీ ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● ఏసీపీ గుజ్జుల రమేష్



డ్రగ్స్, సైబర్ నేరాల గురించి వివరించిన ఏసీపీ గుజ్జుల రమేష్‌ను సన్మానిస్తున్న సేయింట్ జోసెఫ్ పాఠశాల యాజమాన్యం

తిరుమలగిరి ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలని తిరుమలగిరి డివిజన్ ఏసీపీ గుజ్జుల రమేష్ పిలుపునిచ్చారు. శనివారం తిరుమలగిరి లాల్‌బజార్‌లోని సేయింట్ జోసెఫ్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డ్రగ్స్ విక్రయిదారులపై ఉక్కుపాదం మోపుతున్నామని సైబర్ నేరస్థులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలల వద్ద డ్రగ్స్‌ను చాక్లెట్లు రూపంలో విక్రయిస్తున్నారని విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాల ద్వారా ఎందరో విద్యార్థులు ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని వాటి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు స్మార్ట్ ఫోన్లలో వచ్చే సదరు ప్రకటనలను ఇంటర్నెట్ ద్వారా వచ్చే లింకులను వినియోగించకూడదని సూచించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఫోన్ చేసి ఖాతా వివరాలు అడిగి లక్షలాది రూపాయలను దోచుకుంటున్నారని అలాంటి సైబర్ నేరగాళ్లకు వివరాలు అందించకూడదని అన్నారు. డ్రగ్స్ వాడకంతో వచ్చే అనార్థాలను వివరించారు. డ్రగ్స్ మహమ్మారిని, సైబర్ నేరగాళ్లను తరిమికొట్టడానికి పాఠశాల స్థాయి నుంచే శంఖం పూరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులను ఆయన కోరారు.

కార్యక్రమంలో తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సేయింట్ జోసెఫ్ పాఠశాల పూర్వ విద్యార్థిని ఆంథోనియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

● మేకల సారంగపాణి



తార్నాక చౌరాస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

తార్నాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీజేపీ సికింద్రాబాద్ మహాకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో ఇటీవల హబ్సిగూడ చౌరాస్తాలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడాన్ని నిరసిస్తూ తార్నాక డివిజన్ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో శనివారం తార్నాక చౌరాస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ హబ్సిగూడ చౌరాస్తాలో ఇటీవల రెండు వారాల్లోనే వరుస రోడ్డు ప్రమాదాలలో పదవ తరగతి విద్యార్థి సాత్విక, ఆరవ తరగతి విద్యార్థి కామేశ్వరి ఇద్దరు స్కూల్ విద్యార్థులు మృతి చెందడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పోలీసులకు, ప్రభుత్వానికి ట్రాఫిక్ చలాన్లపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై లేదని తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థుల భద్రత కోసం ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ సిబ్బందిని పెంచి స్కూల్ సమయాలలో ప్రతి చౌరాస్తా దగ్గర తప్పనిసరిగా ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తార్నాకలోని సెయింట్ ఆన్స్ స్కూల్ దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్ గౌడ్, రవి ప్రసాద్ గౌడ్, వేణు యాదవ్, కనకట్ల హరి, ప్రకాష్ గౌడ్, మలికంటి వీరన్న, శారద మల్లేష్, సుబ్బారావు, భిక్షపతి యాదవ్, అంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి నుంచి రూ.10.53 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో అధిక లాభాలు ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు 62 ఏళ్ల వృద్ధున్ని 'మామ్' వాట్సాప్ క్లబ్‌లో చేర్పించి, లాభాలు ఇస్తున్నట్లు నటించి రూ.10,53,696లను కొల్లగొట్టారు. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి గోడు వెల్లబోసుకున్నాడు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫేస్‌బుక్ చూస్తున్న బాధితుడికి ఒక ప్రకటన కనిపించింది. స్టాక్ ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే.. అధిక లాభాలు వస్తాయని ఉంది. దాంతో ఆ లింక్‌పై క్లిక్‌చేశాడు. వెంటనే లైన్‌లోకి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు బాధితుని ఫోన్ నంబర్‌ను 'మామ్ క్లబ్' వాట్సాప్‌లో చేర్పించారు. ముందుగా కొద్దిమొత్తంలో పెట్టుబడి పెట్టించిన క్రిమినల్స్ కొద్దిమొత్తంలో లాభాలు ఇచ్చారు. వాటిని విత్‌డ్రా చేసుకున్న బాధితుడు ఇదంతా నిజమైన స్టాక్ ట్రేడింగ్ అని నమ్మాడు. అలా సైబర్ నేరగాళ్లు మెల్లగా బాధితున్ని ఊబిలోకి దింపి.. ఇంకా ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి ప్లేస్టోర్ నుంచి 'ఎంటీపీఎస్' అప్లికేషన్ డౌన్‌లోడ్ చేయించారు. ఆ తర్వాత నలుగురు మాత్రమే ఉన్న మరో గ్రూపు 'మామ్ క్లబ్ వీఐపీ ఏ97' లో చేర్పించారు. ఆ తర్వాత నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ సృష్టించి విడతలవారీగా పెట్టుబడులు పెట్టించి రూ.10,53,696 కొల్లగొట్టారు. విత్‌డ్రా ఆప్షన్ క్లోజ్ చేసిన మోసగాళ్లు.. ఇంకా ఇంకా పెట్టుబడులు పెట్టాలని ఒత్తిడి చేయడంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రవచనాలు చెబుతున్న స్వామిజీ

గణేశ్ ఆలయాన్ని సందర్శించిన విద్యాశంకరస్వామి

బోయినపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణార్థమై విశ్వశాంతిని కాంక్షిస్తూ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య, మహా సంస్థాన పీఠాధిపతి శ్రీమత్ అభినవోద్దండ ఎ.విద్యాశంకర భారతీ స్వామి శనివారం సాయంత్రం బోయిన్‌పల్లి భావనకాలనీలోని గణేశ్ ఆలయాన్ని సందర్శించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మద మల్లికార్జున్ దంపతులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు స్వామిజీకి ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ప్రవచనాలు గావించి భక్తులకు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలకు చెందిన భక్త బృందాలు భజనలు, సంకీర్తనలు చేశారు. సభాధ్యక్షుడిగా డాక్టర్ కేవీ రమణాచారి వ్యవహరించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రజా సంబంధాలు, సమాచారశాఖలో 33 ఏళ్లుగా పనిచేసి శనివారం ఉద్యోగ విరమణ పొందిన చెంగల రవీందర్‌ను కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణలు సహజమన్నారు. ఉద్యోగ సమయంలో వారు చేసిన సేవలు చిరకాలం నిలుస్తాయన్నారు. సమాచారశాఖలో రవీందర్ వృత్తి నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ కలీం, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పప్పెట్ షోలో దృశ్యం

అలరించిన పప్పెట్ షో

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్ఫూర్తి థియేటర్ ఫర్ ఎడ్యుకేషనల్ పప్పెట్రీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేషా రాడ్ పప్పెట్ షో ఆకట్టుకుంది. శనివారం సికింద్రాబాద్ అవర్ సాక్రెడ్ స్పేస్‌లో శివపురాణంలోని ఒక ఘట్టం గణేషా రాడ్ పప్పెట్ షో లో ప్రదర్శించారు. ఇరవై మంది పాఠశాల విద్యార్థులు తమ కళానైపుణ్యంతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. పప్పెట్ షోను భవిష్యత్ తరాలకు అందించాలని విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు పద్మిని రంగరాజన్ తెలిపారు.



విరమణ వీడ్కోలు సభలో నిమ్స్ ఉద్యోగులు

నిమ్స్ ఉద్యోగులకు సన్మానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఉద్యోగులు పలువురు శనివారం పదవీ విరమణ చేశారు. ఆస్పత్రి మొదటి అంతస్తులోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగులను ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారిలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజ్‌కుమార్, సీనియర్ మెడికో సోషల్ వర్కర్ పార్వతి, ఇందిర, ఎక్స్‌రే టెక్నీషియన్ ఆనంద్‌రావు, సెక్రటేరియల్ అసిస్టెంట్ విజయలక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్ సత్యగీత ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పీకే హజారి దంపతులను సన్మానిస్తున్న విమానాశ్రయ ఉద్యోగులు

బేగంపేట విమానాశ్రయం డైరెక్టర్ పదవీ విరమణ

బేగంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బేగంపేట విమానాశ్రయం డైరెక్టర్‌గా సేవలందించిన పీకే హజారి శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా విమానాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగులు పీకే హజారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నూతన డైరెక్టర్ వరుదు వి.రావు హాజరయ్యారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు గోపకుమార్, కె.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఈటలపై ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలకు ఖండన

పంజాగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, 24 గంటల్లో ఆయన క్షమాపణ చెప్పకుంటే ఇంటిని ముట్టడిస్తామని ఈటల రాజేందర్ అభిమానులు, వివిధ సంఘాల నాయకులు హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈటల అభిమానులు, ఎంపీటీసీల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్, ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ నెహ్రూనాయక్, బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ శ్రీనాథ్, అశోక్, బి.రాజుముదిరాజ్, భైరి శేఖర్, రామిడి వెంకట్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రామలింగం ప్రజాపతి, తదితరులు మాట్లాడారు. ప్రొఫెసర్ తన స్థాయిని మరిచి ప్రజానేతపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఈటల అభిమానులు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహిళలను వెంబడించడమే కాకుండా ఫోన్ నంబర్ అడుగుతూ వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనర్సింహనగర్‌కు చెందిన కె.సరిత ఇళ్లలో పనిచేస్తుంది. చాలాకాలం క్రితం భర్తతో విడిపోయి ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసముంటుంది. ప్రతి రోజూ పని నిమిత్తం నవోదయ కాలనీలోని ఉషా ఎన్‌క్లేవ్‌కు వస్తుంది. కొన్ని రోజులుగా రవి అనే వ్యక్తి వెంబడించడం మొదలు పెట్టాడు. గత వారం ఫోన్ నంబర్ అడిగాడు. దీంతో సరిత హెచ్చరించింది. ఇదిలా ఉండగా ఈ నెల 30న రవికి ఆమె కుమార్తె కనిపించింది. బాలికను ఆపి సరిత ఫోన్ నంబర్ అడిగాడు. ఇదే విషయం కుమార్తె చెప్పడంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు చోరీ

యూసుఫ్‌గూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాలు చోరీ అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎండీ అజారుద్దీన్ ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 29న విధులు ముగించుకుని రాత్రి తాను నివసిస్తున్న ఇంటి వద్ద ద్విచక్రవాహనం పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. అలాగే, సారథి స్టూడియో సమీపంలో నివసించే వి.సూర్యజగన్నాథం ఈ నెల 29న రాత్రి తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనం పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.



బోయిన్‌పల్లి సాయిపద్మజ కాలనీ వేంకటేశ్వరస్వామి కల్యాణంలో భక్తులు

వైభవంగా స్వామివారి కల్యాణం

బోయిన్‌పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం పురస్కరించుకుని బోయిన్‌పల్లి సాయిపద్మజ కాలనీలోని కమిటీ హాల్ ఆవరణలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ ం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి కల్యాణం తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వివిధ కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర అపార్ట్‌మెంట్, మేఘదీప్ అపార్ట్‌మెంట్, మనవి అపార్ట్‌మెంట్, నేహా అపార్ట్‌మెంట్, అఖిల అపార్ట్‌మెంట్, పొద్దుటూరి అపార్ట్‌మెంట్, దియా అపార్ట్‌మెంట్‌లతో పాటు వివిధ కాలనీల భక్తులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న నాయకుల్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్

బీసీ నేతలను పరామర్శించిన నాయకులు

అడ్డగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఏడు రోజులుగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో అమర నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్‌లను శనివారం మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. అంతకు ముందు సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పిడికిలి రాజు, ఓబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ అవ్వారు వేణు కుమార్, అంబేడ్కర్ ఆజాద్ సంఘ్ అధ్యక్షుడు కొంగర నరహరి పరామర్శించారు.



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మేకల సారంగపాణి

అడ్డగుట్టలో బీజేపీ సభ్యత్వ నమోదు

అడ్డగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో అడ్డగుట్ట డివిజన్ ప్రథమ స్థానంలో ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. శనివారం సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లోని బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయాలని ప్రతి బూతు నుంచి మూడు వందల మందిని సభ్యులుగా చేర్చుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సిహెచ్ కన్నాభిరాం, నరేందర్, కృష్ణ, నర్సింగ్‌రావు, సాయిబాబా, రవీందర్, మహేందర్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గురుకుల హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలి

● బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి

అడ్డగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ మండలం పాలమాకులే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం పెడితే ఇదేమని ప్రశ్నిస్తే ఇంటి నుంచి బాక్సు తెచ్చుకోమని దురుసుగా ప్రవర్తిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన పరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణలో హాస్టళ్ళ, పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఇప్పటికైనా కనీస సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది.



మాట్లాడుతున్న టీచర్ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

ఆకారపు కళావతి సేవలు అభినందనీయం

● టీచర్ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

అల్వాల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బొల్లారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (త్రిశూల్‌పార్క్) హిందీ ఉపాధ్యాయురాలు ఆకారపు కళావతి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. కార్యక్రమానికి టీచర్ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 41 సంవత్సరాలుగా ఉద్యోగంలో ఉండి కళావతి విద్యారంగానికి, సమాజానికి చేసిన కృషి అభినందనీయమన్నారు. హైదరాబాద్ జిల్లా డీఈవో రోహిణి మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో ఉన్నత పౌరులుగా ఎదగడానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీకి గురైన ద్విచక్రవాహనంపై రూ.22 వేల ట్రాఫిక్ చలాన్

● పోలీసులను ఆశ్రయించిన యజమాని



ఎంజే బ్రిడ్జి వద్ద తిరుగుతున్న చోరీకి గురైన ద్విచక్రవాహనం

బోయిన్‌పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాలుగు సంవత్సరాల క్రితం బోయిన్‌పల్లిలో చోరీకి గురైన ద్విచక్రవాహనంపై రూ.22 వేలకు పైగా ట్రాఫిక్ చలాన్‌లు రావడంతో ఖంగుతిన్న యజమాని బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించాడు. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన వెంకట్‌రెడ్డి సీసీ కెమెరాల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో 2020 ఏప్రిల్ నెలలో తన ఇంటిముందు పార్క్ చేసిన హోండా యాక్టివా (ఏపీ10ఏఆర్8187) కనిపించకుండా పోయింది. వెంటనే బైక్ చోరీకి గురైందని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు సంవత్సరాల తరువాత ట్రాఫిక్ పోలీసుల నుంచి 66 ట్రాఫిక్ చలాన్‌లు మొత్తం రూ.22,525 కట్టాలని వెంకట్‌రెడ్డికి నోటీసు వచ్చింది. దీంతో ఖంగుతిన్న వెంకట్‌రెడ్డి శనివారం బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించి గతంలోనే బైక్ చోరీకి గురైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పోయిన బైక్‌కు చలాన్ ఎలా కట్టాలని ప్రశ్నించారు. ఆ బైక్ వాడుతున్న వ్యక్తితోనే చలానా కట్టించి, తన బైక్ తనకు అప్పగించాలని పోలీసులను కోరారు. వెంటనే స్పందించిన ఎస్ఐ శివశంకర్ కేసును క్రైం డీఐ సర్దార్ నాయక్‌కు అప్పగించారు. దీంతో ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన క్రైమ్ పోలీసులు ట్రాఫిక్ చలాన్ ఆధారంగా ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఎక్కువగా ఓల్డ్‌సిటీలోనే ఆ టూ వీలర్ ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించారు. పోలీసులు వాహనం కోసం గాలిస్తున్నారు.